

కరాటే వీరులు..
ఐదేళ్ల బాలల నుంచి మహిళల వరకు కరాటే సాధన చేస్తున్నారు. కటా, కుమతి, కుంగ్-ఫూ తదితర అంశాల్లో హోరాహోరీగా పోటీపడుతున్నారు.
- 8లో▸



ఇంటింటికీ అభివృద్ధి ఫలాలు
రాష్ట్రంలో ప్రతీ ఇంటికి అభివృద్ధి ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క అన్నారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
$28.1^0 / 16.2^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

మండల ప్రజా పరిషత్ ఏర్పాటు

రేగొండ(కొత్తపల్లిగోరి): జిల్లాలో నూతనంగా ఏర్పడ్డ కొత్తపల్లిగోరి మండలానికి 14 గ్రామ పంచాయతీలతో మండల ప్రజా పరిషత్ ఏర్పాటుకు పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ జిల్లాల్లోని నూతన మండలాల్లో ఎంపీడీఓ కార్యాలయాల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో వచ్చే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు మార్గం సుగమమైంది.

అదనపు ఎస్పీగా బోనాల కిషన్



భూపాలపల్లి: అదనపు ఎస్పీ(అడ్మిన్)గా బోనాల కిషన్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బోనాల కిషన్ ప్రస్తుతం ఓఎస్డీ (ఆపరేషన్స్)గా పనిచేస్తుండగా ఇదే జిల్లాకు అదనపు ఎస్పీగా ప్రభుత్వం నియమించింది.

29న మహా దీపోత్సవం

కాళేశ్వరం: కార్తీకమాసాన్ని పురస్కరించుకొని మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో ఈనెల 29న మహా దీపోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఈఓ ఏ.మారుతి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు ఆలయం ఆవరణలో 11,116 దీపాలను వెలిగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు.

మినహాయింపు ఇవ్వాలి

భూపాలపల్లి అర్బన్: ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించకుండా మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్(టీఆర్‌టీఎఫ్) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పెండెం మధుసూదన్, కూచనపల్లి రవీందర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయులు ప్రతీ రోజు అనేక ఆన్‌లైన్ రిపోర్టులు పంపిస్తున్నట్లు చెప్పారు. బోధనేతర కార్యక్రమాలు పాఠశాలలో నిర్వహించడం వలన బోధన సమయం కోల్పోతున్నట్లు తెలిపారు.

ఏఐటీయూసీ ధర్నా



భూపాలపల్లి అర్బన్: కేంద్ర ప్రభుత్వ రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి క్యాతరాజు సతీష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బ్రాంచి కార్యదర్శి చంద్రమౌళి, నాయకులు శ్రావణ్, కమలాకర్, రమేష్ పాల్గొన్నారు.

కాళేశ్వరాలయంలో భక్తుల రద్దీ



కాళేశ్వరం: కార్తీకమాసం సందర్భంగా కాళేశ్వరాలయంలో శ్రీకాళేశ్వర ముక్తీశ్వరుడిని భక్తులు దర్శించుకున్నారు. మంగళవారం ముందుగా త్రివేణి సంగమ గోదావరిలో పుణ్యస్నానాలు చేశారు. అనంతరం శ్రీసుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో కాలసర్ప నివారణ పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వివిధ పూజలు, లడ్డూ ప్రసాదాల ద్వారా ఒక్క రోజు రూ.4.30లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు



మల్హర్: గంజాయి విక్రయించినా, సేవించినా చర్యలు తప్పవని కాటారం సీఐ నాగార్జున రావు హెచ్చరించారు. కాటారం పోలీస్ స్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడారు. గంజాయి అమ్ముతున్న కొయ్యూరు, కొండంపేట, ఇప్పలపల్లి గ్రామాలకు చెందిన ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 1.54 కిలోల గంజాయి, ఓ బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు ఎస్సై వడ్లకొండ నరేష్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

కాటారం మండలం రేగులగూడెం కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం



పుంజుకోని కొనుగోళ్లు

తేమ, తాలు పేరిట జాప్యం
- రోజుల తరబడి కేంద్రాల వద్ద రైతుల పడిగాపులు
- ప్రైవేట్ వైపు మొగ్గు చూపుతున్న అన్నదాతలు
- ఇప్పటివరకు కొనుగోలు చేసింది 664 టన్నులు మాత్రమే..



కాటారంలో ప్రైవేట్ వ్యాపారులకు అమ్మడానికి సిద్ధంగా ఉన్న ధాన్యం

కాటారం: జిల్లావ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేశామని అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం కొనుగోళ్లు పుంజుకోవడం లేదు. వరి కోతలు సైతం నెలరోజుల క్రితమే ప్రారంభమయ్యాయి. అయినప్పటికీ పూర్తిస్థాయిలో ధాన్యం సేకరణ జరగడం లేదు. టేకుమట్ల, పలిమెల, మహదేవపూర్ మండలాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ కాంటాలు మాత్రం జరగడం లేదు. దీంతో రైతులు రోజుల తరబడి తమ ధాన్యంతో కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. పలువురు రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి మద్దతు ధరతో సంబంధం లేకుండా తమ ధాన్యాన్ని విక్రయించి నష్టపోతున్నారు.

తేమ, తాలు పేరిట జాప్యం..
జిల్లావ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల వద్ద పెద్ద ఎత్తున వరి ధాన్యం నిల్వ ఉన్నప్పటికీ నిర్వాహకులు తేమ, తాలు పేరిట కొనుగోళ్లలో జాప్యం చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. తేమ శాతం 17 ఉంటే అభ్యంతరం లేకుండా కొనుగోలు చేయాలని కలెక్టర్, ఉన్నతాధికారులు ఆదేశించినప్పటికీ నిర్వాహకులు మాత్రం తేమ శాతం 14 ఉంటేనే కొనుగోలు చేస్తామని తేల్చిచెపుతున్నారు. అంతేకాకుండా తాలు లేకుండా ఉండాలని తుర్పాల మిషన్ల ద్వారా ధాన్యాన్ని ఒకటికి రెండు మార్లు తూర్పాల పెట్టిస్తున్నారు. దీంతో రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోవడానికి 10 రోజులకు పైగా కేంద్రాల వద్ద ఉండాల్సి వస్తుంది. రైతుల సమయం వృథా కావడంతో పాటు ఆర్థిక భారం పెరుగుతుంది. ఇవన్నీ కారణాలతో కొనుగోళ్లు ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు.

ఇప్పటివరకు 664 టన్నులు సేకరణ..
ప్రభుత్వం ద్వారా వరి ధాన్యం కొనుగోలు కోసం జిల్లాలో 189 కేంద్రాలు ఏర్పాటు చేయగా 180 కేంద్రాల్లో కొనుగోళ్లు సాగుతున్నట్లు అధికారులు చెప్పుకొస్తున్నారు. కానీ క్షేత్ర స్థాయిలో ఆ లెక్కల ప్రకారం కొనుగోళ్లు జరగడం లేదు. జిల్లా మొత్తంలో సుమారు రెండు లక్షల టన్నుల వరి ధాన్యం దిగుమతి వచ్చే అవకాశం ఉండగా 1.50 లక్షల టన్నుల సేకరణ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ ఇప్పటివరకు కేవలం 664 టన్నుల ధాన్యం సేకరించినట్లు అధికారులు తెలుపుతున్నారు.

ప్రైవేట్ వైపు మొగ్గు..
ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర అందుతున్నప్పటికీ కొనుగోళ్లలో జాప్యం జరుగుతుండటంతో రైతులు ప్రైవేట్ వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రైవేట్ వ్యాపారులు, మిల్లర్లు వరి కోతలు కాగానే రైతులను నేరుగా కలిసి తేమతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. వరి కోత మిషన్ నుంచి రైతులు ట్రాక్టర్‌లో నింపుకొని మిల్లులు, లేదా ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. ప్రభుత్వం నుంచి సన్నరకం ధాన్యానికి మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,320, బోనస్ రూ.500, దొడ్డు రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2300 అందుతుంది. ప్రైవేట్ వ్యాపారులు, మిల్లర్లు రైతు నుంచి సన్నరకం ధాన్యం రూ.2600, దొడ్డు రకం ధాన్యం రూ.2320 చొప్పున క్వింటాల్‌కు 2 కిలోల నుంచి 3 కిలోల తరుగుతో కొనుగోలు చేస్తుండటం రైతులు అధికశాతం ప్రైవేట్ వైపు అమ్మడానికే ఆసక్తి చూపుతున్నారు. సన్నరకం ధాన్యం పండించిన రైతులు బోనస్ రూ.500 నష్టపోతున్నప్పటికీ తప్పనిసరి పరిస్థితుల్లో ధాన్యం ప్రైవేట్‌కు విక్రయించక తప్పడం లేదని చెప్పుకొస్తున్నారు.

జిల్లా వివరాలు

వరి సాగు	1,05,000 ఎకరాలు
కొనుగోలు కేంద్రాలు	189
ప్రారంభమైనవి	180
ధాన్యం దిగుమతి	సుమారు 2లక్షల మెట్రిక్ టన్నులు
కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరణ లక్ష్యం	1.50 లక్షల మెట్రిక్ టన్నులు
ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం	664 మెట్రిక్ టన్నులు

కాంటాలు ప్రారంభించలేదు..



వరి కోసి ధాన్యం చేతికి వచ్చి పది రోజులు గడుస్తుంది. ఇప్పటివరకు కొనుగోలు కేంద్రంలో కాంటాలు ప్రారంభించలేదు. రోజుల తరబడి కొనుగోలు కేంద్రం వద్ద వడ్లకు కాపాలా కాస్తూ ఉండాల్సి వస్తుంది. వెంటనే కాంటాలు పెట్టి ధాన్యం కొనుగోలు చేయాలి.
- ఎల్లస్వామి, రైతు, టేకుమట్ల

రైతులు ఆందోళన చెందొద్దు



కొనుగోలు కేంద్రాల్లో నిబంధనలకు అనుగుణంగా వరి ధాన్యం కొనుగోళ్లు చేపడుతున్నాం. తేమ 17 శాతం ఉన్నప్పటికీ ధాన్యం కొనుగోలు చేయాలని, త్వరితగతిన కాంటాలు పెట్టాలని కేంద్రాల నిర్వాహకులను ఆదేశించాం. రైతులకు ఇబ్బందులు కలగకుండా చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తాం. రైతులు ఆందోళన చెందొద్దు.
- రాములు, డీఎం సివిల్ సప్లయీస్

ఆత్మవిశ్వాసాన్ని నింపేందుకే క్రీడాపోటీలు

కలెక్టర్ రాహుల్ శర్మ



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్

భూపాలపల్లి: దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం నింపి సామర్థ్యాలను వెలికితీసేందుకే క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ క్రీడా మైదానంలో జిల్లా మహిళ, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి దివ్యాంగుల క్రీడా మహోత్సవ పోటీలకు మంగళవారం కలెక్టర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి జెండా ఊపి క్రీడలను ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. వైకల్యం అనేది శరీరానికే కానీ మనసుకు కాదన్నారు. పోటీల్లో పాల్గొన్న దివ్యాంగుల అద్భుత ప్రతిభను చూసి కలెక్టర్ అభినందించారు. శరీరం సహకరించకపోయినా, ఎందులోనూ తాము తక్కువ కాదని ఆటల్లో పాల్గొని నిరూపించారని అన్నారు. వివిధ క్రీడా విభాగాల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన వారికి అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం రోజున సన్మానాలు, బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం దివ్యాంగులతో కలిసి కలెక్టర్ ఫొటోలు దిగారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మహిళా, శిశు, వయోవృద్ధుల, దివ్యాంగుల సంక్షేమ జిల్లా అధికారి చిన్నయ్య, ఎన్జీఓలు పాల్గొన్నారు.

దీక్షా దివస్‌కు తరలిరావాలి

మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్



సమావేశంలో మాట్లాడుతున్న సత్యవతిరాథోడ్

భూపాలపల్లి అర్బన్: బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 29న జిల్లా కేంద్రంలో నిర్వహించే దీక్షా దివస్‌కు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశానికి సత్యవతిరాథోడ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం కేసీఆర్ 2010 నవంబర్ 29న ఆమరణ దీక్ష ప్రారంభించినట్లు తెలిపారు. కేసీఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడో అనే నినాదంతో ప్రాణాలకు తెగించి తెలంగాణ సాధించినట్లు తెలిపారు. దానికి గుర్తుగా నేటి తరం పిల్లలకు తెలియాలనే ఉద్దేశ్యంలో ఈ నెల 29న దీక్షా దివస్ చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామాలకు చెందిన కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని సూచించారు. తెలంగాణలో పదేళ్ల పాటు ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని ఏడాది కాలంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు మోసపూరిత హామీలను ఇచ్చి గద్దెనెక్కినట్లు ఆరోపించారు. రాష్ట్రంలో అసమర్థ పాలన నడుస్తుందని సీఎంకు మంత్రులు సహకరించలేని పరిస్థితులు దాపురించాయన్నారు. రాష్ట్ర ప్రజలు విసిగిపోయారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ప్రజలంతా కేసీఆర్ పాలననే కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వంపై పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణిసిద్దు, నాయకులు మేకల సంపత్‌కుమార్, హరీశ్‌రెడ్డి, జనార్దన్, అల్లం రవీందర్, రాజిరెడ్డి, సాగర్, బడితెల సమ్మయ్య, మాడ హరీశ్‌రెడ్డి, దేవేందర్, నర్సింగరావు పాల్గొన్నారు.

ఆధునిక సాగుతో అధిక లాభాలు



బీరసాగును పరిశీలిస్తున్న సంజీవరావు

కాటారం: కూరగాయల సాగులో ఆధునిక పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడి సాధించి మంచి లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యాన శాఖ అధికారి సంజీవరావు అన్నారు. మహాముత్తారం మండలం దౌతుపల్లిలో సదయ్య, గట్టయ్య అనే రైతులు రెండెకరాల్లో సాగుచేస్తున్న పందిరి బీర సాగును మంగళవారం ఉద్యాన శాఖ అధికారి పరిశీలించారు. సాగు విస్తీర్ణం, దిగుబడి, పాటిస్తున్న పద్ధతుల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. అధికారుల సూచనలు, సలహాలు పాటించి మరింత దిగుబడి సాధించాలని సూచించారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో కూరగాయల సాగు రైతులకు ప్రభుత్వం అనేక రాయితీలు, ప్రోత్సాహాలు కల్పిస్తుందని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. సంజీవరావు వెంట డివిజన్ ఉద్యాన శాఖ అధికారిణి వీణ ఉన్నారు.

దళారుల చేతిలో మోసపోవద్దు



చిట్యాల: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

చిట్యాల: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అమ్ముకోవాలే తప్ప దళారులకు అమ్మి మోసపోవద్దని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని ఒడితల, గోపాలపూర్, జడలపేట, నైన్‌పాక, చైన్‌పాక గ్రామాలలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సన్న వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తుందని తెలిపారు. సంక్రాంతి పండగ నుంచి పేదలకు, స్కూల్ విద్యార్థులకు, హాస్టళ్లకు సన్నబియ్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, తహసీల్దార్ హేమ, ఎంపీడీఓ జయశ్రీ, నాయకులు దొడ్డి కిష్టయ్య, గణపతి, గడ్డం కొంరయ్య, నక్క భాస్కర్ పాల్గొన్నారు.

సన్న వడ్లకు రూ.500 బోనస్
టేకుమట్ల: రైతులు పండించిన సన్న వడ్లకు ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని రాఘవరెడ్డిపేట, వెల్లంపల్లి, గుమ్మడవెల్లి, కుందనపల్లి, ఎంపేడు గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రవి, వీరేశం పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన
భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలం గొర్లవీడు, వజినేపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పర్యటించారు. 3.60 కోట్లతో కాశీంపల్లి నుంచి గొర్లవీడు గ్రామం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు గొర్లవీడు గ్రామంలో శంకుస్థాపన చేశారు. అనంతరం డీపీఓ నారాయణరావుతో కలిసి వజినేపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు.

రాజ్యాంగానికి లోబడి పనిచేయాలి



మాట్లాడుతున్న జడ్జి జయరాంరెడ్డి

భూపాలపల్లి అర్బన్: దేశంలోని ప్రతీ వ్యవస్థ రాజ్యాంగానికి లోబడి పని చేయాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జయరాంరెడ్డి తెలిపారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి జడ్జి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్యాంగంలోని ఆర్టికల్-19 ప్రకారం ప్రాథమిక హక్కులు కల్పించబడినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నాయకులు కోర్టు సిబ్బంది, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో..
జిల్లా కోర్టు ప్రాంగణంలో సమావేశం ఏర్పాటు చేసి రాజ్యాంగ ఉపోద్ఘాతం పఠనం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా సీనియర్ సివిల్ జడ్జి జయరాంరెడ్డి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి రామచంద్రరావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి అఖిలు హాజరుకాగా ఈ కార్యక్రమంలో ఏఓ అనితావని, అన్ని కోర్టుల సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగిరం చేయాలి

కలెక్టర్ రాహుల్ శర్మ



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్



ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి: వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగిరం చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు, సీఎస్ శాంతి కుమారి, పౌర సరఫరాల శాఖ కమిషనర్ చౌహాన్, ఇతర సీనియర్ అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం పలు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం కలెక్టర్ రాహుల్ శర్మ కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతీరోజు ధాన్యం కొనుగోలు కేంద్రానికి ఎంత ధాన్యం వస్తుంది, ఇంకా ఎంత ధాన్యం రావాల్సి ఉందనే అంచనాలతో సిద్ధంగా ఉండాలన్నారు. మిల్లుల్లో ఓపీఎంఎస్ వేగవంతం చేసేందుకు ప్రత్యేక అధికారులను నియమించనున్నట్లు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం ట్యాగ్ చేసిన మిల్లులకు జాప్యం లేకుండా రవాణా చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం రాసులు నిల్వ ఉండకుండా, ఎప్పటికప్పుడు రవాణాచేసే విధంగా తగినన్ని లారీలను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, సహకార అధికారి వాలియానాయక్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ
గణపురం: సంక్షేమ, అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని.. దీనిపై అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. గణపురం మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్నాహ్న భోజనాన్ని మంగళవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనం ఎలా ఉంది.. కూరలు ఎలా ఉన్నాయంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బియ్యం, సరుకుల స్టోర్‌ను పరిశీలించారు. నిరంతరం తనిఖీలు చేయాలని తహసీల్దార్, ఎంపీడీఓ, మండల ప్రత్యేక అధికారిని ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కలెక్టర్‌కు మొక్కను అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, మండల ప్రత్యేక అధికారి కుమారస్వామి, డీఆర్‌డీఓ నరేష్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం తనిఖీ..
ధాన్యం కొనుగోలు వేగవంతంగా సమర్థవంతంగా జరగాలని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గణపురం మండలంలోని అప్పయ్యపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం..
గణపురం: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ రాహుల్ శర్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వే ఆన్‌లైన్ ప్రక్రియ, ధరణి పెండింగ్ దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, తహసీల్దార్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

బీసీ కులగణనతోనే హక్కులు

మొగుళ్లపల్లి: బీసీ కులగణనతోనే హక్కులు దక్కుతాయని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్‌గౌడ్ అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీలకు రిజర్వేషన్లు దక్కాలంటే కులగణన జరగాల్సిందేనన్నారు. బీసీలకు రాజకీయ అండదండలు లేకపోవడం వల్లే అన్యాయం జరుగుతుందని చెప్పారు. జనాభాలో సుమారు 60 శాతానికి పైగా బీసీలు ఉన్నారన్నారు. బీసీ కులగణన జరిగితేనే రిజర్వేషన్లకు రాజ్యాంగబద్ధత వస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు అంబేడ్కర్ పుణ్యాన రిజర్వేషన్లు వచ్చాయన్నారు. పట్టుమని 8 శాతం కూడా లేని అగ్రవర్ణాలు 10 శాతం ఈడబ్ల్యూఎస్ పేరుతో రిజర్వేషన్లను పొందుతున్నారన్నారు. బీసీలు ఎవరికీ వ్యతిరేకం కాదని, బీసీలకు రాజ్యాంగబద్ధమైన అధికారాలు లేవన్నారు. దాదాపు జనాభాలో 60 శాతంకు పైగా బీసీలు ఉన్నారన్నారు.

క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలి

సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న జీఎం

భూపాలపల్లి అర్బన్: సింగరేణి క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడాలని ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. ఏరియాలోని అంబేడ్కర్ ఇండోర్ స్టేడియంలో మంగళవారం జరిగిన సింగరేణి కంపెనీ స్థాయి క్యారమ్, చెస్ క్రీడాపోటీలకు ముఖ్యఅతిథిగా జీఎం హాజరై ప్రారంభించారు. క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసికంగా దృఢంగా తయారయ్యే అవకాశం ఉందన్నారు. కంపెనీ స్థాయి పోటీలలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు కోలిండియా పోటీలలో స్వర్ణ పతకాలు సాధించి సింగరేణి విజయపతాకాన్ని ఎగరవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైపీఎం రాజు, సీనియర్ పీఓ శ్రావణ్‌కుమార్ అధికారులు, కార్మిక సంఘాల నాయకులు హనరీ, శ్రీనివాసరావు, రమేష్, రాజేందర్, శ్రీనివాస్, తిరుమల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజ్యాంగ దినోత్సవం
రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏరియాలోని సింగరేణి జీఎం కార్యాలయంలో మంగళవారం అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు జోతి, రవికుమార్, సురేఖ, దయాకర్, పోషమల్లు, ప్రదీప్ పాల్గొన్నారు.

16 మంది ప్యాసింజర్ గార్డుల తరలింపు

- ఆందోళనలో కాజీపేట రైల్వే గార్డులు
- ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలని విజ్ఞప్తి

కాజీపేట రూరల్: కాజీపేట నుంచి 16 మంది రైల్వే ప్యాసింజర్ గార్డులను అధికారులు బదిలీ చేశారు. ఈ మేరకు మంగళవారం పలువురు రైల్వే గార్డులు, రైల్వే నాయకులు మాట్లాడుతూ సికింద్రాబాద్ తర్వాత అతిప్రధాన కాజీపేట జంక్షన్‌ను నిర్వీర్యం చేసేందుకు కుట్ర జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా ఇటీవల రైల్వే లింక్‌లను ఇతర రైల్వే డిపోలకు తరలించారన్నారు. ప్రస్తుతం కొత్తగా కాజీపేట కేంద్రంగా పని చేస్తున్న 16 మందిని వేరే రైల్వే డిపోలకు తరలించి ఈ డిపోకు ప్రాధాన్యం తగ్గించేందుకు కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు. కాజీపేట డిపోలో 2024లో 17 రైల్వే గార్డుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని అధికారులు గుర్తించారన్నారు. ఇదిలా ఉండగా ఇటీవల ట్రెనింగ్ పూర్తయిన 18 మంది కాజీపేట రైల్వే గార్డుల్లో16 మందిని సోమవారం వేరే డిపోలకు తరలించారని తెలిపారు. కాజీపేట నుంచి ఇతర రైల్వే డిపోలకు గార్డుల తరలింపు వల్ల రైల్వేశాఖకు లక్షలాది రూపాయలు ఖర్చు అవుతుందని, అదే 16 మంది రైల్వే గార్డులకు ఇక్కడే పోస్టింగ్ ఇస్తే రూ.16 లక్షలు ఆదా అవుతాయన్నారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు ఆలోచించి తరలించిన గార్డులను తిరిగి కాజీపేటకు తీసుకొచ్చి రైల్వేకు ఆదాయం మిగిలేలా చూడాలని నాయకులు పేర్కొంటున్నారు.

రైల్వే వ్యాగన్, కోచ్‌ఫ్యాక్టరీ, కాజీపేట డివిజన్..

కాజీపేట రైల్వే వ్యాగన్‌షెడ్ నిర్మాణమవుతుండగా మరో వైపు కాజీపేట రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇదిలా ఉండగా కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటుకు అడుగులు పడుతున్న క్రమంలో కొంత మంది రైల్వే అధికారులు కావాలని గతంలో క్రూ లింక్‌ల తరలింపు చేయగా, ఇప్పుడు గార్డుల తరలింపు చేసి కాజీపేట లో కోపైలెట్ కార్యాలయాన్ని నిర్వీర్యం చేసే కుట్రచేస్తున్నారని నాయకులు ఆరోపిస్తున్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు పట్టించుకుని రైల్వే జీఎంతో మాట్లాడాలని రైల్వే గార్డులు, నాయకులు కోరుతున్నారు.

ధిక్కరణ కేసులో తహసీల్దార్‌ను మందలించిన కోర్టు

వరంగల్ లీగల్ : కోర్టు ఆదేశాలను ఎనిమిది నెలలుగా అమలు చేయకుండా ధిక్కరించిన హసన్‌పర్తి తహసీల్దార్ సీహెచ్. ప్రసాద్‌ను ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి ఉపేందర్‌రావు మంగళవారం తీవ్రంగా మందలించారు. హసన్‌పర్తి మండలం పెంబర్తి గ్రామానికి చెందిన ఏరుకొండ సుజాత వంశపారపర్యంగా ఉమ్మడి కుటుంబ ఆస్తిలో తన భాగం ఇవ్వాలని కోర్టులో దావా వేసింది. దీనిపై విచారణ చేసిన కోర్టు 2024 ఏప్రిల్‌లో అప్పటి జడ్జి శ్రీనివాసులు తీర్పు వెల్లడించారు. పిటిషన్‌దారు ఏరుకొండ సుజాతకు తన ఇరువురి సోదరులతో పాటు మూడో భాగం వాటాను పంపకం చేసి రిజిస్ట్రేషన్, పట్టా పాస్ బుక్‌లు జారీ చేయాలని హసన్‌పర్తి తహసీల్దార్‌ను ఆదేశిస్తూ తీర్పు వెల్లడించారు. అయితే ఎనిమిది నెలలుగా ఈ తీర్పును అమలు చేయకుండా కాలయాపన చేసిన తహసీల్దార్‌ను గతంలో తన ఎదుట ప్రత్యక్షంగా హాజరు కావాలని జడ్జి ఆదేశించారు. అయినా హాజరుకాకపోవడంతో మంగళవారం తహసీల్దార్ సీహెచ్. ప్రసాద్‌ను జడ్జి ఉపేందర్‌రావు మూడు రోజుల జ్యుడిషియల్ రిమాండ్‌కు ఆదేశించారు. విషయం తెలిసిన జిల్లా కోర్టు ప్రభుత్వ న్యాయవాది తహసీల్దార్‌తో సహా హాజరై లిఖిత పూర్వకంగా క్షమాపణ కోరిన అనంతరం తీర్పులో భాగంగా పిటిషన్‌దారు ఏరుకొండ సుజాత వాటాను రిజిస్ట్రేషన్ చేసి వెంటనే పట్టా పాస్ బుక్‌లు జారీ చేశారు. ఉదయం నుంచి కోర్టు ప్రాంగణంలో ఈ విషయంపై ఉత్కంఠ వాతావరణం నెలకొంది. రాజ్యాంగ దినోత్సవం రోజున మహిళలకు తమ వాటా తమకు దక్కేలా తీర్పు అమలు కావడంతో పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

కరాటే వీరులు..

ఎవరు కొడితే.. మైండ్ బ్లాక్ అయిపోతుందో.. వారే కరాటే వీరులు.. మార్షల్ ఆర్ట్స్‌కు హనుమకొండ జిల్లా కేరాఫ్‌గా మారుతోంది. ముఖ్యంగా బాలబాలికలు, మహిళల్లో కరాటే ఆత్మవిశ్వాసం నింపుతోంది. తమపై దాడి చేయాలని చూసే వారి భరతం పట్టేలా తయారవుతున్నారు. అంతేకాదు ఈ పోటీల్లో పతకాలు సాధిస్తూ జాతీయస్థాయిలో ప్రతిభ చూపుతూ జిల్లా పేరును నిలబెడుతూ పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు.



కాజీపేటలో కరాటేలో శిక్షణ పొందుతున్న బాలబాలికలు



- మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ కనబరుస్తున్న బాలబాలికలు
- జిల్లాలో సాధన చేస్తున్న చిన్నారులు
- జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సొంతం
- శిక్షకులుగా రాణిస్తున్న యువత

కాజీపేట: జిల్లాలో ఐదేళ్ల బాలల నుంచి మహిళల వరకూ కరాటే సాధన చేస్తున్నారు. ఒకనాడు పదుల సంఖ్యలో ఉన్న సాధకులు నేడు వందల సంఖ్యలోకి చేరారు. ఫలితంగా జాతీయస్థాయి కరాటే పోటీలకు జిల్లా కేంద్ర బిందువుగా మారింది. కాజీపేట పట్టణంలో రెండుసార్లు జాతీయస్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాకు చెందిన అనేక మంది సాధకులు ఇతర రాష్ట్రాలకు చెందిన వారిని ఓడించి పలు పతకాలు సొంతం చేసుకున్నారు. నగరంలోని అనేక క్రీడా మైదానాలతోపాటు కాజీపేట మండలంలోని పలు గ్రామాల్లో శిక్షణ కేంద్రాలు ఉన్నాయి. కటా, కుమతి, కుంగ్‌ఫూ తదితర అంశాల్లో బాలబాలికలు హోరాహోరీగా పోటీపడుతున్నారు. పదుల సంఖ్యలో కరాటే శిక్షకులు శిక్షణ అందిస్తున్నారు. కుంగ్‌ఫూ, జపాన్ షాటోఖాన్ కరాటే, మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్లు పోటీలు నిర్వహిస్తూ పిల్లలో ఆసక్తి పెంచుతున్నాయి. ప్రభుత్వ ఆదేశం మేరకు మూడు నెలల పాటు ప్రభుత్వ పాఠశాలల్లో సైతం బాలికలకు వారంలో మూడు రోజులు శిక్షణ ఇస్తుండడం విశేషం. వారు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థులు రాణిస్తున్నారు. ఆత్మ రక్షణకు అవసరమైన రీతిలో శిక్షణ పొందుతున్నారు.

ఆత్మవిశ్వాసం పెరిగింది..



కరాటే అంటే మాకు చాలా ఇష్టం. కుంగ్‌ఫూ మాస్టర్ పర్యవేక్షణలోనే తగిన శిక్షణ తీసుకుంటున్నాం. సెలవు రోజుల్లో ఉదయం, సాయంత్రం రెండు గంటల చొప్పున సాధన చేస్తున్నాం. మాలో ఎక్కడా లేని ఆత్మవిశ్వాసం పెరిగింది. ఎటువంటి పరిస్థితులైనా ఎదుర్కొంటామనే ధైర్యం ఏర్పడింది. గ్రీన్, ఎల్లో బెల్టులు సాధించాం.

– కొలిపాక సాత్విక, కల్యాణి, మడికొండ

అందరికీ మార్షల్ ఆర్ట్స్ అవసరమే..



అందరికీ మార్షల్ ఆర్ట్స్ అవసరమేనని గుర్తించాలి. ఎటువంటి విపత్కర పరిస్థితులైననా సునాయాసంగా ఎదుర్కొనే మొండి ధైర్యం దీని శిక్షణతో కలుగుతుంది. చిన్నప్పటి నుంచే పిల్లలకు ఆటపాటలతో పాటు కరాటేలో శిక్షణ ఇప్పించాలి. దాని వల్ల మానసికంగా, శారీరక సమస్యలు తట్టుకోవడానికి అలవాటు పడతారు.

– డి.కంఠేశ్, గ్రాండ్ మాస్టర్

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

- కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి



రాజ్యాంగ పీఠిక ప్రమాణం చేయిస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్ : మహోన్నత రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందామని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం క్యాంపస్‌లోని సెనేట్‌హాల్‌లో రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన సంవిదాన్ దివస్ రాజ్యాంగ దినోత్సవ సభలో వీసీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశ అభివృద్ధి రాజ్యాంగం వినియోగంపై ఆధారపడి ఉంటుందన్నారు. ప్రధానవక్త కేయూ లా కాలేజీ రిటైర్డ్ ప్రొఫెసర్ టి. విజయచంద్ర 'భారత రాజ్యాంగం డెమొక్రటిక్ గవర్నెన్స్' అనే అంశంపై మాట్లాడుతూ సామాజిక ప్రజాస్వామ్యం తోనే రాజకీయ ప్రజాస్వామ్యం సాధ్యమన్నారు.మన స్వేచ్ఛను సరెండర్ చేయొద్దన్నారు. సభలో కేయూ పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ బి. సురేశ్‌లాల్, డాక్టర్ బి. రమ, ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్ వి. రాంచంద్రం, కేయూఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ, కేయూ ఫార్మసీ డీన్ గాదె సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, యూనివర్సిటీ మొదటిగేట్ నుంచి విద్యార్థుల పాదయాత్రను వీసీ ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. దూరవిద్యకేంద్రం ప్రాంగణంలోఅంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.రిజిస్ట్రార్ మల్లారెడ్డి బోధన, బోధనేతర ఉద్యోగులు, విద్యార్థులతో రాజ్యాంగ పీఠిక ప్రమాణం చేయించారు.

భారత రాజ్యాంగం గొప్పది

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ: భారత రాజ్యాంగం గొప్పదని ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో సీఎండీ వరుణ్‌రెడ్డి రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం దేశంలోని పౌరులకు హక్కులు కల్పించిందన్నారు. రాజ్యాంగం ద్వారానే స్వేచ్ఛ, స్వాతంత్ర్యం పొందుతున్నామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు టి.సదర్ లాల్, బి.అశోక్ కుమార్, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, సి.వి.ఓ బి.జనార్దన్, సీఈలు కె.తిరుమల్ రావు, అశోక్, కె.ఎన్.గుట్ట, బీకం సింగ్, రవీంద్రనాథ్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యపరీక్షల కోసం వెళ్తే ఇల్లు గుల్ల..

- తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి పాల్పడిన దుండగులు
- 4 కిలోల వెండి, 10 తులాల బంగారు ఆభరణాలు, రూ.60 వేల నగదు అపహరణ



ఘటనా స్థలిని పరిశీలిస్తున్న టౌన్ సీఐ దేవేందర్, ఎస్సై భీమారెడ్డి

మహబూబాబాద్ రూరల్ : అనారోగ్య కారణాలతో వైద్య పరీక్షల నిమిత్తం ఓ కుటుంబం హైదరాబాద్ వెళ్లింది. ఇదే అదునుగా భావించిన దుండగులు ఆ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని హస్తినాపురం కాలనీలో నివాసం ఉండే మాజీ వార్డు సభ్యురాలు జెన్నాయికోడె శోభ, వేణుగోపాల్ దంపతులు వైద్య పరీక్షల నిమిత్తం సోమవారం ఇంటికి తాళంవేసి హైదరాబాద్ వెళ్లారు. ఆస్పత్రిలో ఆలస్యం కావడంతో రాత్రి అక్కడే ఉన్నారు. మంగళవారం ఉదయం తమ ఇంట్లో పనిచేసే మహిళ వచ్చి చూడగా తలుపులు తీసి కనిపించాయి. దీంతో ఆమె ఆందోళన చెంది పక్కింటివారికి చెప్పగా వారు వెంటనే శోభ, వేణుగోపాల్ దంపతులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. వారు హుటాహుటిన వచ్చి పరిశీలించగా ఇంటి ప్రధాన ద్వారానికి ఉన్న సెంట్రల్ లాక్ తొలగించి ఉంది. ఇంట్లోని రెండు బీరువాల్లో భద్రపరిచిన 4 కిలోల వెండి, 10 తులాల బంగారు ఆభరణాలు, రూ.60 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్సై భీమారెడ్డి, క్లూస్ టీం, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

కుమారుడికి సద్ది ఇవ్వడానికి వెళ్లి..

- బావిలో పడి గొర్రెల కాపరి మృతి



మల్లయ్య(ఫైల్)

దుగ్గొండి: గొర్రెల మంద వద్ద ఉన్న తన కుమారుడికి భోజనం అందించడానికి వెళ్లిన ఓ గొర్రెల కాపరి బావిలో పడి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని దేశాయిపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన గొర్రెల కాపరి కోట మల్లయ్య(60) సోమవారం రాత్రి మంద వద్ద ఉన్న తనకుమారుడికి భోజనం టిఫిన్ పట్టుకుని వెళ్తున్నాడు. అయితే మందకు కొంత దూరంలో వ్యవసాయ బావి వద్ద కాలుజారి అందులో పడ్డాడు. దూరం నుంచి గమనించిన కుమారుడు తోటి గొర్రె కాపరులతో కలిసి బావిలోకి దిగి మల్లయ్యను బయటకు తీశారు. అనంతరం దుగ్గొండి ఆసుపత్రికి తరలించారు. గాయాలపాలైన మల్లయ్య మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య పద్మ, కుమారులు నవీన్, రాజుకుమార్ ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు.

కేయూలో రెండు రోజుల జాతీయ సదస్సు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని సోషియాలజీ, సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 28, 29 తేదీల్లో రెండు రోజులపాటు క్యాంపస్‌లోని సెనేట్‌హాల్‌లో జాతీయ సదస్సు నిర్వహించబోతున్నట్లు ఆ విభాగం అధిపతి, సెమినార్ డైరెక్టర్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. 'గ్లోబలైజేషన్ అండ్ డెవలప్‌మెంట్, సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ మ్యాపింగ్ ది ట్రాజెక్టరీస్ ఆఫ్ సోషల్ ఇన్‌స్టిట్యూట్స్ అండ్ ప్రాసెస్ ఇన్ కాంటెంపరరీ ఇండియా' అనే అంశంపై ఈ జాతీయ సదస్సు నిర్వహించబోతున్నామని తెలిపారు.ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులుగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పాల్గొననున్నట్లు తెలిపారు. ఓయూ పొలిటికల్ సైన్స్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ కె. శ్రీనివాసులు కీలకోపన్యాసం చేస్తారని తెలిపారు.

రైతు సదస్సులో వరంగల్ మార్కెట్ స్టాల్



చపాట రకం మిర్చి కలాసీ రకం.. వండర్‌హాట్ రకం..

వరంగల్: మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న రైతు సదస్సులో ఏనుమాముల వరంగల్ వ్యవసాయ మార్కెట్ నుంచి స్టాల్ ఏర్పాటు చేస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి పి.నిర్మల మంగళవారం తెలిపారు. 28వ తేదీన సదస్సును మార్కెటింగ్ డైరెక్టర్ ఉదయ్‌కుమార్ ప్రారంభిస్తున్నారని, 30వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈసదస్సులో ఏర్పాటు చేసిన స్టాల్‌లో చపాటా, కలాసీ (ఎల్లోకలర్ మిర్చి), వండర్‌హాట్ రకాల మిర్చి శాంపిల్స్‌ను ప్రదర్శనలో ఉంచుతున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి పి.నిర్మల పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య

- వెంకటాపురంలో ఘటన



శోభన్‌బాబు(ఫైల్)

దుగ్గొండి: ఆర్థిక ఇబ్బందులతో ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని వెంకటాపురంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన హింగే శోభన్‌బాబు(48)కు నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఏటా మిర్చి పంట సాగు చేస్తున్నాడు. ఎన్నిసార్లు సాగు చేసిన నష్టమే తప్పా లాభం రాలేదు. ఈ క్రమంలో వ్యయసాయ పెట్టుబడులు, కుటుంబ అవసరాలు, ఇద్దరు ఆడపిల్లల పెళ్లిళ్లు ఇలా మొత్తం రూ. 10లక్షల వరకు అప్పు అయ్యింది. అయితే అప్పు ఎలా తీర్చాలని కొంతకాలంగా మనస్తాపం చెందుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం మిరపతోట వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. ఈ విషయం పెద్ద కూతురు రవళికి ఫోన్‌చేసి చెప్పాడు. దీంతో భార్య హింగే ఉమ కొంతమంది రైతులతో కలిసి బావివద్దకు వెళ్లగా కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. వెంటనే నర్సంపేటకు తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు.

ఇంటింటికీ అభివృద్ధి ఫలాలు

- రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్క



బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

గణపురం: తెలంగాణ రాష్ట్రంలో ఇంటింటికీ అభివృద్ధి ఫలాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పని చేస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ఈ మేరకు మంగళవారం గణపురం మండలకేంద్రంలో జరిగిన ప్రజాపాలన విజయోత్సవ సభకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుతో కలిసి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నియోజక వర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. రాజ్యాంగం ఏర్పడి నేటికి 75 సంవత్సరాలు కావడం.. ఈ రోజే ప్రజాపాలన విజయోత్సవ సభ నిర్వహించుకోవడం సంతోషకరమన్నారు. ప్రతి మహిళ ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా తెలంగాణ సర్కారు పని చేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వం ఇంటికో ఉద్యోగం ఇస్తానని చెప్పి ఊరుకో ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. తమ సర్కారు సంవత్సరకాలంలోనే 53 వేల ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. బీఆర్ఎస్ పది సంవత్సరాల కాలంలో రైతులకు రుణ మాఫీ చేయలేదని, తమ ప్రభుత్వం ఒకేసారి రూ. 18వేల కోట్ల రుణ మాఫీని ఏక కాలంలో చేసిందన్నారు. కాగా, గణపురం నుంచి గుర్రంపేట వెళ్లేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే వారని, ఎమ్మెల్యే సత్యనారాయణ రావు కృషితో రూ. 15 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డుతో పాటు మోరంచ వాగు పై హైలెవల్ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ తాము ప్రజా సేవకులమని, ప్రజల కష్టాలు, సమస్యలు తీర్చడం కోసం 18 గంటల పాటు పని చేస్తున్నట్లు తెలిపారు. గత పాలకులు తమ స్వార్థం కోసం ప్రైవేట్ వ్యక్తులకు 170 ఎకరాలు అప్పగించగా తాను భూమిని వెనక్కి తీసుకుని ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు గాంధీనగర్ గుట్ట మీద 60 ఎకరాల్లో ఇండస్ట్రీయల్ పార్క్‌ను, 40 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ శర్మ, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

దొంగల ఆచూకీ కోసం ముమ్మర ప్రయత్నాలు

- సాంకేతికతను వినియోగిస్తున్న పోలీసులు



బాధితుడితో మాట్లాడుతున్న సీఐ సుధాకర్ రెడ్డి

కాజీపేట : కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలో ఈ నెల 23వ తేదీన దావ కిశోర్ అనే వ్యక్తి ఇంట్లో జరిగిన చోరీ కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. భార్య ఆస్పత్రికి.. తాను పిల్లల కోసం ట్యూషన్ వద్దకు వెళ్లి వచ్చే సరికి దొంగలు చొరబడి ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. పోలీసులు దాదాపు 35 తులాల బంగారం చోరీకి గురైనట్లు చెబుతుండగా బాధితుడు మాత్రం ఎక్కువే జరిగిందని తెలుపుతున్నాడు. దొంగలు ఢిల్లీ రిజిస్ట్రేషన్ వాహనం వినియోగించినట్లు సీసీ కెమెరాల్లో కనిపించడంతో దొంగలు స్థానికుల లేక ఇతర రాష్ట్రాలకు చెందిన వారా అనే అంశం అర్థం కావడం లేదు. కిశోర్‌కు తెలిసిన వాళ్లు ఎవరైనా చోరీకి పాల్పడి.. కేసును పక్కదారి పట్టించడం కోసం ఢిల్లీ రిజిస్ట్రేషన్ వాహనాన్ని వినియోగించి ఉంటారా అనే కోణంలో పోలీసులు పరిశీలిస్తున్నారు. ఇంట్లో బీరువాపై ఉన్న వేలిముద్రలను సేకరించి పాత నేరస్తులతో సరిపోల్చుతున్నారు. సాంకేతికతను వినియోగించుకుంటూ దొంగలను పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. సీపీ అంబర్ కిశోర్ ఝా ఆదేశం మేరకు కేసు ఛాలెంజ్‌గా తీసుకుని ముందుకు సాగుతున్నారు. టాస్క్‌ఫోర్స్ సిబ్బందితోపాటు లోకల్ సీఐ, ఎస్సైలు ప్రత్యేక టీమ్‌లుగా ఏర్పడి దొంగలను పట్టుకోవడానికి అడుగులు వేస్తున్నారు.

ఏళ్లు గడిచినా డబ్బులు ఇవ్వలేదంటూ..

- మాజీ ప్రజాప్రతినిధి ఇంటి ఎదుట దంపతుల ఆత్మహత్యాయత్నం
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం



మాజీ జెడ్పీటీసీ సారయ్య ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న భాస్కర్ దంపతులు

వరంగల్ : వరంగల్ ఏనుమాముల 14వ డివిజన్ కార్పొరేటర్ భర్త, మాజీ జెడ్పీటీసీ తూర్పాటి సారయ్య డబ్బులు ఇవ్వడం లేదంటూ సుందరయ్యనగర్‌కు చెందిన గంధ్రతి భాస్కర్ దంపతులు మంగళవారం ఆత్మహత్య చేసుకుంటామంటూ పెట్రోల్ బాటిల్‌తో సారయ్య ఇంటి ఎదుట బైఠాయించారు. ఏనుమాములలో సుమారు 600 గజాల భూమిని సారయ్య, భాస్కర్, రాజు కొనుగోలు చేశారు. ఈ భూమిలో మరో వ్యక్తి గృహ నిర్మాణం చేస్తుండగా అడ్డుకోవడంతో మూడేళ్ల క్రితం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఆ భూమికి చెల్లించిన డబ్బులు ఇస్తే కేసు విరమించుకుంటామని భాస్కర్, రాజు పోలీసులకు చెప్పడంతో సారయ్య ఇరువురికి డబ్బులు ఇచ్చేందుకు ఒప్పుకున్నాడు. అయితే డబ్బులు ఇస్తామని చెప్పి ఏళ్లు గడిచినా చెల్లించకపోవడంతో విసిగివేసారిన భాస్కర్ దంపతులు ఆందోళనకు దిగినట్లు స్థానికులు తెలిపారు. పెట్రోల్ బాటిల్‌తో ఆందోళన చేస్తున్న విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. ఆందోళనను విరమింపజేసి భాస్కర్ దంపతులను పోలీసుస్టేషన్‌కు తీసుకువెళ్లారు. అక్కడ పెద్ద మనుషులు ఇరువర్గాలతో చర్చించారు. వచ్చే నెల 10వ తేదీన సారయ్య డబ్బులు ఇవ్వాలని, ఆ డబ్బులు అతడు ఇవ్వకుంటే తాను ఇస్తానని డివిజన్‌కు చెందిన అధికార పార్టీ నాయకుడు హామీ ఇవ్వడంతో కథ సుఖాంతం అయ్యింది. ఈ విషయంపై కార్పొరేటర్ భర్త, మాజీ జెడ్పీటీసీ సారయ్య మాట్లాడుతూ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరినందుకే ఇలా చేస్తున్నారని ఆరోపించారు. తాను భాస్కర్‌కు ఎలాంటి డబ్బులు బాకీ లేనన్నారు. స్థలం కొనాలని భాస్కర్ ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఆ స్థలం రిజిస్ట్రేషన్ చేస్తే 10వ తేదీలోగా డబ్బులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు.